క్లుప్తంగా

11 మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

అల్లవరం: మండలంలోని దేవగుప్తం గ్రామానికి చెందిన చిట్టూరి శ్రీనివాస్ నుంచి యానానికి చెందిన 11 మద్యం సీసాలను, అతని మోటారు సైకిల్‌ని స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ శివరామరాజు బుధవారం తెలిపారు. దాడుల్లో ఎస్ఈబీ ఎస్సై సీహెచ్ స్వామిరెడ్డి, కానిస్టేబుల్ నూతన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలోనే ప్రసవాలు



అనాతవరంలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ దుర్గారావు దొర

ముమ్మిడివరం: ప్రభుత్వాసుపత్రిలో ప్రసవాలు జరిగిలా మహిళలలో చైతన్యం తీసుకురావాలని జిల్లా వైద్యాధికారి దుర్గారావు దొర సూచించారు. ముమ్మిడివరం మండలం అనాతవరంలో బుధవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకున్నారు. ఏఎన్ఎం, ఏహెచ్ఎం రికార్డులను పరిశీలించి సేవలను మరింత విస్తృతం చేయాలని సూచించారు.

ఇద్దరికి అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు



అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు స్వీకరించిన నాయకులు

యానాం: యానాం అంబేడ్కర్‌నగర్‌కు చెందిన ఇద్దరికి అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులు లభించాయని బుధవారం కళైమామణి దక్షిణ భారత దళిత సాహిత్య అకాడమీ అధ్యక్షుడు పొనుగుమట్ల విష్ణుమూర్తి తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన 39వ భారతీయ దళితసాహిత్య అకాడమీ ఉత్సవాలను పురస్కరించుకుని దళిత సమస్యలపై కృషి చేసిన గుర్రపు ప్రహ్లోదుడు, కోరుకొండ రాజేంద్రప్రసాద్‌లు అవార్డులను అధ్యక్షుడు డాక్టర్ సుమనాక్షర్ చేతులమీదుగా స్వీకరించారన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంచిపెడుతున్న యోగాశ్రమ గురువు శ్రీనివాస్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీ స్వామి వివేకానంద యోగాశ్రమం పేదలకు దుప్పట్లు పంచింది. పట్టణంలోని పేదలు, అనాథలు, యాచకులకు ఆ యోగాశ్రమ గురువు ఆకులు శ్రీనివాస్ ఆధ్వర్యంలో 120 దుప్పట్లను బుధవారం అందించారు.

అంబులెన్స్‌లను రిపేర్ చేయించాలి

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న అంబులెన్స్‌లు అవసానదశలో ఉన్నాయని వాటికి మరమ్మతులు చేయించాలని డిమాండ్ చేస్తూ బుధవారం డ్రైవర్లు జీజీహెచ్ ఏడీ పళనిష్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ మొత్తం 5 అంబులెన్స్‌లు ఉన్నాయని అన్నీ రిపేర్ దశలో ఉన్నాయన్నారు. రోగులు, అత్యవసర సమయాల్లో ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. దీనికి ఆయన స్పందించి ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళతానన్నారు.

హాస్టల్ కుక్‌ను సస్పెండ్ చేయాలి

అమలాపురం రూరల్: సమనస గురుకుల పాఠశాలలో ఫుడ్ పాయిజన్‌తో విద్యార్థుల అస్వస్థతకు కారణమైన ఆ పాఠశాల హాస్టల్ కుక్‌ను సస్పెండ్ చేయాలని జిల్లా బీజేపీ డిమాండ్ చేసింది. ఈ మేరకు అమలాపురం ఏరియా ఆస్పత్రి వద్ద బీజేపీ నాయకులు కొద్దిసేపు నిరసన వ్యక్తం చేశారు. పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా పార్టీ అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావు చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించారు.

భవిత కేంద్రానికి కుర్చీల వితరణ

అల్లవరం: గోడిలంకలోని సీతాపతిరాజు మెమోరియల్ ట్రస్టు, కొమరగిరిపట్నంలోని మోసుగంటి గంగయ్య మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో బండారులంకలోని భవిత కేంద్రానికి రూ.15 వేల విలువ చేసే కుర్చీలను ట్రస్టు చైర్మన్లు రుద్రరాజు రమేష్‌రాజు, మోసుగంటి వెంకటేశ్వరరావు బుధవారం అందించారు. ఎస్టీయూ సీనియర్ నాయకుడు నాగిరెడ్డి శివప్రసాద్ కంచాలు అందించారు. ఎంఈఓలు సూర్యప్రకాశం, దుర్గాదేవి, హెచ్ఎం ఎస్ఎల్‌వీ బాల పాల్గొన్నారు.



ముమ్మిడివరం మండలం అన్నంపల్లిలో ధాన్యం ఆరబెట్టుకుంటున్న రైతులు



ధాన్యం బస్తాలను తరలిస్తున్న దృశ్యం

చి'వరి'లో పోరాటం

- తుపాను నష్టం తగ్గించుకునేందుకు రైతుల ఆరాటం
- పంటను ఒబ్బిడి చేసే పనిలో నిమగ్నం

ముమ్మిడివరం: అన్నదాతలపై ప్రకృతి కన్నెర చేస్తోంది. ఆరుగాలం శ్రమించిన పండించిన పంట చేతి కందే సమయంలో ఏటా వరదలు, తుపానులు సంభవించి రైతులకు నష్టాలను మిగుల్చుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం నుంచి వాతావరణం అనుకూలించినప్పటికీ చేతికి పంటకొచ్చే సమయంలో ప్రతికూల వాతవరణం కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షా భావ పరిస్థితుల నడుమ ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని సాగు చేసినా పంట చివరికి నీటి పాలయ్యింది. మిచాంగ్ తుపాను ప్రభావంతో విస్తారంగా కురిసిన వర్షాలకు ముమ్మిడివరం నియోజకవర్గంలో పలు గ్రామాలలో కోత కొచ్చిన చేలు నేలకొరిగాయి. కోత కోసిన పనలు, ధాన్యం రాశులు తడిసి ముద్దయ్యాయి. ప్రస్తుత వాతావరణం అనుకూలంగా ఉండటంతో రైతులు పంటను ఒబ్బిడి చేసే పనిలో బిజీగా ఉన్నారు. కోసిన పనలు సైతం నీట మునిగాయి. నేలకొరిగిన వరిచేలల్లో గింజలు మొలకలు వచ్చాయి. ఈదురుగాలులకు అరటి, ఇతర కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయాధికారులు కష్టకాలంలో రైతులకు అండగా నిలుస్తున్నారు. తుపానుకు పంట దెబ్బతిన్న ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించి రైతులకు పలు సూచనలు, సలహాలు ఇస్తున్నారు. సస్య రక్షణ చర్యలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు.

తడిసి ముద్దయ్యాయి



ఖరీఫ్‌లో 15 ఎకరాలు వరి సాగు చేశాను. సుమారు ఎనిమిది ఎకరాలలో కోత కోసి ధాన్యం రాశులుగా చేశాను. తుపాను కారణంగా ఆ ధాన్యం తడిసి ముద్దయింది. వరిచేలు నేల కొరిగాయి. ధాన్యం ఆరబెడుతున్నాను. గిట్టుబాటు ధర వస్తుందో లేదో తెలియదు. నీట మునిగి ముంపు నీరు దిగక పనలు కుళ్లి గింజలు మొలకెత్తుతున్నాయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కొమ్మిరెడ్డి శ్రీనివాసరావు, రైతు, గాడిలంక

తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నాం



నీట మునిగిన వరిచేలల్లో ముంపు నీరు దిగేందుకు బోదెలు ఏర్పాటు చేసుకోవాలి. తడిసిన ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించి ఆరబెట్టుకోవాలి. అధికారుల సూచనల మేరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. పంట నష్టాల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తాం.

– ఎస్.ప్రశాంతకుమార్, ఏఓ, ముమ్మిడివరం



తాళ్లరేవులో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరిస్తున్న నేతలు

సుస్థిర పాలన జగన్‌తోనే సాధ్యం

తాళ్లరేవు: రాష్ట్రంలో సుస్థిరమైన పాలన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వల్లే సాధ్యమవుతుందని ఎంపీపీ రాయుడు సునీత అన్నారు. బుధవారం తాళ్లరేవు సచివాలయం–2 పరిధిలో ఆంధ్రప్రదేశ్‌కు జగనన్నే ఎందుకు కావాలంటే కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమంతో పాటు అభివృద్ధిని కూడా చేస్తూ రాష్ట్రాన్ని అన్ని రంగాలలో ప్రగతి పథంలో నడిపిస్తున్న జగన్‌ను ముఖ్యమంత్రిగానూ, ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌ను ఎమ్మెల్యేగానూ గెలిపించాలని కోరారు. స్థానిక చెరువుగట్టు సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ జెండాను గ్రామ కమిటీ కన్వీనర్ ఆకుల వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. గ్రామ సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసినీదేవి, ఎంపీటీసీ సభ్యుడు రత్స ముత్యాలు, నాయకులు చిట్టూరి చలపతి, నందికోళ్ల శ్రీమన్నారాయణ, ఉపసర్పంచ్ విత్తనాల రామకృష్ణ, భూసారపు పద్మారావు, బి.శ్రీనివాసరెడ్డి, బొంతు మోహన్, పొన్నాడ భైరవమూర్తి పాల్గొన్నారు.

అడ్వంచర్ క్యాంప్‌నకు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

యానాం: హిమాచల్‌ప్రదేశ్ అటల్‌బిహారీ వాజపేయ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మౌంటెనీరింగ్ అండ్ అలైడ్ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే నేషనల్ సర్వీస్ స్కీమ్ అడ్వంచర్ క్యాంప్‌నకు యానాం రీజియన్ నుంచి 8 మంది ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఎంపికైనట్లు బుధవారం కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణసుధాకర్ ప్రకటనలో తెలిపారు. ఈనెల 19నుంచి 28వ తేదీవరకు నిర్వహించే అడ్వంచర్ క్యాంపునకు యానాం రీజియన్ నుంచి నలుగురు అంబేడ్కర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ నుంచి, మరో నలుగురు రీజెన్సీ జూనియర్ కళాశాల నుంచి ఎంపికయినట్లు తెలిపారు. దీనికి ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా సరెళ్ల వీరకుమార్ వెళుతున్నారన్నారు.

గోవుల సంతతిని రక్షించుకోవాలి

తాళ్లరేవు: నడిచే దేవాలయం గోవును కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని నేపథ్య గాయకుడు స్వర్గీయ ఘంటశాల వెంకటేశ్వరరావు మనుమడు ఉందుర్తి మహీకిరణ శర్మ తెలిపారు. బుధవారం నీలపల్లి గ్రామంలో వేద పండితులు మంథా వెంకటేశ్వర శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భువనేశ్వరి, వీరభద్రుని పీఠంలో ఆయన పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోక కల్యాణం కోసం నిర్వహిస్తున్న ఏకాహ మహోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహీకిరణ శర్మ మాట్లాడుతూ గోవుల సంతతి అంతరించిపోవడం ద్వారా మానవాళికి తీవ్ర ముప్పు ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే విషపూరిత ఆహారం తీసుకోవడం ద్వారా అనేక మంది అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా గోవు పిడకలతో హోమం నిర్వహించారు. సర్పంచ్ చిట్టూరి నాగమణి, ఉంగరాల వెంకటేశ్వరరావు, సలాది సత్తిబాబు పాల్గొన్నారు.



మహిళలతో గో పిడకల హోమం చేయిస్తున్న మహీకిరణ శర్మ

పాడ్యమి దీపాల వెలుగులు



అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయ కోనేరులో దీపాలు వదులుతున్న మహిళలు

అమలాపురం టౌన్: పవిత్ర కార్తిక మాసం ముగింపు సందర్భంగా నియోజకవర్గంలోని మహిళలు బుధవారం వేకువ జాము నుంచే తమ దగ్గరలో ఉన్న పంట కాల్వలు, ఆలయాల కోనేరులతో పాడ్యమి దీపాలు వదిలారు. అమలాపురం ప్రధాన పంట కాల్వ పారుతున్న పట్టణంతోపాటు అమలాపురం రూరల్, ఉప్పలగుప్తం, అల్లవరం మండలాలకు చెందిన మహిళలు పలు గ్రామాల్లో ఉన్న కాల్వ పావంచాల వద్ద పూజలు చేసి దీపాలు వెలిగించారు. అమలాపురం వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రాంగణంలో గల కోనేరులో మహిళలు దీపాలు వెలిగించి పూజలు చేశారు. . మహిళలు వెలగించిన కార్తిక దీపాలతో పంట కాల్వలు, ఆలయ కోనేర్లు దేదీప్యమాన వెలుగులతో శోభను సంతరించుకున్నాయి. అమలాపురం పట్టణం మీదుగా పారే ప్రధాన పంట కాల్వలో కిలోమీటరు మేర విస్తరించిన ఎన్టీఆర్ మార్గ్ పొడవునా మహిళలు పాడ్యమి దీపాలు వదిలారు.

పేరూరులో గడపగడపకూ మన ప్రభుత్వం

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం జరిగింది. మంత్రి విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకుల బృందం గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుంది. డాక్టర్ శ్రీకాంత్ ఇంటింటికీ తాగు నీటి కుళాయిలను ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబీలకు గడపగడపకూ మన ప్రభుత్వం పత్రాలను పంపిణీ చేశారు. వ్యక్తిగత అవసరాలే కాకుండా మౌలిక సదుపాయాల కల్పనలో మన ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని డాక్టర్ శ్రీకాంత్ అన్నారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, గ్రామ సర్పంచ్ దాసరి అరుణ, పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడుపూడి బాబు పాల్గొన్నారు.



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

మద్యం తరలిస్తున్న ముగ్గురి అరెస్టు

ముమ్మిడివరం: యానాం నుంచి అక్రమ మద్యం తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి 83 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఎస్.శివప్రసాద్ తెలిపారు. ట్రైనీ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్ ఇచ్చిన సమాచారం మేరకు ముమ్మిడివరం మండలం చింతపల్లి లంక, కొత్తలంక గ్రామాలలో మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. యానాం నుంచి అక్రమంగా మద్యం తరలిస్తున్న కాట్రేనికోన మండలం చిర్రయానం గ్రామానికి చెందిన మేడ నాగూర్, బలుసుతిప్పకు చెందిన తిరుమాని వీరబాబును అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 48 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కొత్తలంకలో మద్యం తరలిస్తున్న దూడల సత్యనారాయణను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివప్రసాద్ తెలిపారు.



మద్యం సీసాలతో అదుపులోకి తీసుకున్న నిందితులు

పోస్టల్ సిబ్బంది సమ్మె

యానాం: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆల్‌ఇండియా డాక్‌సేవక్ యూనియన్ పిలుపు మేరకు రెండరోజు బుధవారం జీడీఎస్ ఉద్యోగుల నిరవధిక సమ్మె కొనసాగింది. కాకినాడ డివిజన్ సహాయ కార్యదర్శి ఎం.బుల్లియ్య మాట్లాడుతూ గ్రాట్యుటీ, గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.5లక్షలకు పెంచాలని, పెన్షన్ సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. 12 బ్రాంచ్‌పోస్టు ఆఫీసుల పరిధిలోని పోస్టుమాస్టర్స్, అసిస్టెంట్ పోస్టుమాస్టర్స్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి సాయం



మృతుని భార్యకు రూ.10 వేల నగదు అందజేస్తున్న ఎంపీపీ సునీత తదితరులు

తాళ్లరేవు: పటవల శివారు శాంతిమూల గ్రామానికి చెందిన పితాని సత్యన్నారాయణ (43) అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ నేపథ్యంలో మృతుని భార్య బంగారమ్మకు వైఎస్సార్ బీమా పథకం కింద మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10 వేలు నగదును ఎంపీపీ రాయుడు సునీత బుధవారం అందజేశారు. మిగిలిన నగదు బ్యాంకులో జమ అవుతుందని తెలిపారు. వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, నాయకులు కొప్పిశెట్టి వెంకట్, సత్యన్నారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్ సునీత పాల్గొన్నారు.

సంక్షేమ ప్రదాత సీఎం జగన్

అల్లవరం: అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని ఎంపీపీ ఇళ్ల శేష గిరిరావు అన్నారు. బోడసకుర్రు సచివాలయం–2 లో బుధవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించారు. అనంతరం సచివాలయంలో సంక్షేమ పథకాల బోర్డును ప్రారంభించారు. మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల మండల కన్వీనర్ తిక్కాప్రసాద్, మాజీ సర్పంచ్ దొమ్మేటి శ్యాంప్రకాష్, గ్రామకమిటీ అధ్యక్షుడు మట్టపర్తి షణ్ముఖరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శేషగిరిరావు

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతిభ

యానాం: పుదుచ్చేరి స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రాథమిక తరగతి స్థాయిలో యానాంకు చెందిన మందపల్లి గ్రేసిల్లాకు అవార్డు లభించిందని బుధవారం కోఆర్డినేటర్ పాలికి ప్రకాష్ తెలిపారు. భీమ్‌నగర్‌లో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న గ్రేసిల్లా ప్రదర్శించిన ప్రాజెక్టుకు బెస్ట్ థీమ్ అవార్డు లభించిందన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ ఆర్ సెల్వం చేతుల మీదుగా అవార్డును అందుకుందని తెలిపారు.



స్పీకర్ సెల్వం చేతులమీదుగా అవార్డు స్వీకరిస్తున్న గ్రేసిల్లా

విద్యా పరికరాల పంపిణీ

ముమ్మిడివరం: ప్రముఖ వ్యాపార వేత్త స్వర్గీయ వెత్సా సూర్యప్రకాశరావు జయంతిని పురస్కరించుకుని బుధవారం స్థానిక భవితా కేంద్రంలో శిక్షణ పొందుతున్న 35 మంది దివ్యాంగ విద్యార్థులకు దుప్పట్లు, విద్యాపరికరాలు అందజేసి వారికి ఉచిత భోజనం సమకూర్చారు. సూర్యప్రకాశరావు భార్య పోచలమ్మ, కుమారులు వీటిని సమకూర్చారు.

ముగిసిన కార్తికమాస దీక్ష



కార్తిక దీక్ష ముగింపు సందర్భంగా పూర్ణాహూతి చేస్తున్న దృశ్యం

ఉప్పలగుప్తం: విలసవిల్లి శ్రీరామ ఆలయంలో చేపట్టిన కార్తిక దీక్ష బుధవారంతో ముగిసింది. పార్థివ లింగానికి పంచామృతాలతో రుద్రహోమం నిర్వహించారు. బ్రహ్మశ్రీ మున్నంగి రామకృష్ణ శర్మ, కిషోర్ శర్మ, ఆదిత్య శర్మ ఆధర్యంలో పూర్ణాహూతి నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

నీలపల్లిలో హిందూ ధర్మ ప్రచార రథం

తాళ్లరేవు: శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి సనాతన హిందూ ధర్మ ప్రచార రథం బుధవారం నీలపల్లి ఆనందాశ్రమం చేరుకుంది. ధర్మ ప్రచార వాగ్గేయకార సంకీర్తనా వాహినీ సేవా సమితి అధ్యక్షుడు, రథసారధి కరుటూరి వెంకట శ్రీనివాసరావు నేతృత్వంలో అన్నమాచార్య సంకీర్తనలతో గ్రామం చేరుకున్న రథానికి గ్రామ మహిళలు పసుపు నీళ్లు చల్లుతూ గోవింద నామ స్మరణలతో స్వాగతం పలికారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు గోవింద నామాల పత్రాలు, కుంకుమ అక్షింతలు అందజేశారు.

అనారోగ్యంతో ఉన్న వారికి, వికలాంగులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించేందుకు 2015 నుంచి నిరంతరాయంగా రథయాత్ర నిర్వహిస్తున్నామన్నారు. ఉంగరాల వెంకటేశ్వరరావు, చిక్కాల నరసింహమూర్తి, కనకాల కొండలరాయుడు పాల్గొన్నారు.

వీఆర్ఓపై దాడికి ఖండన

ఉప్పలగుప్తం: అంబాజీపేట మండల ముక్కామల సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్న వీఆర్ఓ దంగేటి పార్థసారధిపై ముక్కామల సర్పంచ్ కుమారుడు దాడికి చేసి విధులకు ఆటంకం కలిగించినందుకు నిరసనగా ఉప్పలగుప్తం వీఆర్ఓలు విరామ సమయంలో నిరసన తెలిపారు. చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సుబ్రహ్మణ్యం వినతిపత్రం అందించారు.

హెల్పింగ్ హ్యాండ్స్ పోస్టర్ల విడుదల



పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, అభిమానులు

అమలాపురం టౌన్: సినీ హీరో వెంకటేష్ జన్మదిన వేడుకలు అమలాపురంలో అభిమానులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు హీరో అభిమానులు నెలకొల్పిన వెంకటేష్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం స్థానిక మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో కేక్ కట్‌చేసి విద్యార్థులకు పెన్నులు, పుస్తకాలు పంచి పెట్టారు. సంఘం అధ్యక్షుడు జీవీ సుబ్రహ్మణ్యం, కోనసీమ అభిమానల సంఘాల ప్రతినిధులు రాయుడు వెంకటేష్, కుడుపూడి శ్రీను, కుసుమ వెంకటేష్ పాల్గొన్నారు.

వీఆర్వోల నిరసన

అమలాపురం రూరల్: అంబాజీపేట మండలం ముక్కామలలో వీఆర్వోపై జరిగిన దాడిని నిరసిస్తూ అమలాపురం తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండల వీఆర్వోలు బుధవారం ఆందోళన చేపట్టారు. నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఎంపీడీవోకు వినతి పత్రం అందించారు. దాడిలో గాయపడి అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ముక్కామల వీఆర్వో పార్థసారిథిని రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు ఎల్లేశ్వరరావు పరామర్శించారు.

జగన్‌తోనే సంక్షేమ పాలన



సంక్షేమ పథకాల ఫ్లెక్సీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు శ్రీ హరి రామగోపాల్

అమలాపురం రూరల్: మండంలోని రెడ్డిపల్లి సచివాలయం వద్ద గ్రామ సర్పంచ్ కరాటం ప్రసన్న అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం బుధవారం జరిగింది. జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి జగన్‌తోనే రాష్ట్రంలో సంక్షేమ పాలన సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం గ్రామంలో సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన ఫ్లెక్సీని ప్రారంభించారు. పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈవోపీఆర్డీ జి.మల్లికార్జునరావు, కరాటం ప్రవీణ్, షేక్ అమీర్, రేలంగి శ్రీను, నల్లా సతీష్ పాల్గొన్నారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి



ఆటల పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ సునీత

తాళ్లరేవు: దివ్యాంగులు దేనిలోనూ తక్కువ కాదని, వారు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి సామ్యూల్ సాగర్ అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని బుధవారం ఉషోదయ మండల దివ్యాంగుల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక లయన్స్‌క్లబ్ భవనంలో జరిగిన ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా ప్రసంగించారు. తొలుత దివ్యాంగులకు లెమన్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, తదితర ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం బహుమతులు ప్రదానం చేశారు.

భీకన్న కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ



భీకన్న కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు తదితరులు

అమలాపురం టౌన్: వైఎస్సార్ సీపీ నాయకుడు అప్పారి భీకన్న మృతికి ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు సంతాపం తెలిపారు. స్థానిక 22వ వార్డు శివారులో ఉన్న భీకన్న ఇంటికి ఎమ్మెల్సీతోపాటు పార్టీ నాయకులు బుధవారం వెళ్లి ఆయన కుటుంబాన్ని పరామర్శించారు. భీకన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకులు కుడుపూడి త్రినాథ్, యనమదల కరుణాకర్ ఆ కుటుంబాన్ని పరామర్శించారు.

సమ్మె విరమించేది లేదు

అమలాపురం టౌన్: భయ భ్రాంతులకు గురి చేసినా తమ సమ్మె విరమించేది లేదని డివిజన్ గ్రామీణ తపాలా ఉద్యోగుల స్పష్టం చేశారు. అమలాపురం ప్రధాన తపాలా కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న డివిజన్‌లోని గ్రామీణ తపాలా ఉద్యోగుల దీక్షా శిబిరానికి ఢిల్లీ పోస్టల్ సెక్రటరీ పంపించిన అప్పీల్ కాపీని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటెండెంట్ డీవీఎల్ విశ్వేశ్వరరావు అందించారు. అయినప్పటికీ ఆ ఉద్యోగులు ఖాతరు చేయకుండా తమ న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకూ సమ్మె విరమించేది లేదని చెప్పారు. యూనియన్ల నాయకులు వైవీ రమణ,, వీవీ రామకృష్ణ,భీమార్జునరావు, రమేష్‌బాబు పాల్గొన్నారు.